భారీ వర్షం.. జనం అస్తవ్యస్తం

చింతలకుంట వద్ద ఉన్న కేఎల్ఎం షోరూం ఎదురుగా నిలిచిన వరదనీరు

జాతీయ రహదారిపై నిలిచిన వరదనీటితో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మన్సూరాబాద్, మే 18: భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చింతలకుంట నుంచి పనామా చౌరస్తాకు వెళ్లే మార్గంలోని కేఎల్ఎం షోరూం వద్ద రోడ్డుపై వరద నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీతో వరద నీటిని దారి మళ్లించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. మన్సూరాబాద్ లోతట్టు కాలనీలు గణేశ్‌నగర్, శ్రీసాయి నాథ్‌కాలనీ, మల్లికార్జుననగర్ నార్త్, ఆగమయ్యకాలనీ, హకీమాబాద్, కామినేని చౌరస్తా నుంచి మన్సూరాబాద్ చౌరస్తాకు వెళ్లే మార్గం, సెంట్రల్‌బ్యాంకు కాలనీ, నాగోల్ డివిజన్ పరిధి ఆనంద్‌నగర్ చౌరస్తా, శ్రీనివాసకాలనీ, విజయగార్డెన్, త్యాగరాయనగర్ కాలనీల్లోని రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

బాలుడు అదృశ్యం

కార్తీక్(ఫైల్)

ఎల్బీనగర్ , మే 18: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడు అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోహన్‌నగర్ ఆర్బీఐ కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ కుమారుడు మద్దలి కార్తీక్ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గమనించిన కుటుంబ సభ్యులు కాలనీతో పాటుగా పరిసర ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బాలుడికి సరిగా మాటలు రావని బాలుడి ఆచూకీ తెలిసిన వారు చైతన్యపురి పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

స్వచ్ఛతకు ప్రత్యేక ప్రణాళిక

ఉప్పల్, మే 18 : బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా జీహెచ్ ఎంసీ సిబ్బంది శనివారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు సర్కిల్ పరిధిలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు డీసీ ఆంజనేయులు తెలిపారు. ఆరుబయట, నాలాలు, ఖాళీ పాట్లలో చెత్తను వేయవద్దన్నారు. స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందించాలని పేర్కొన్నారు. చెత్తను అందించని వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఈ మేరకు సర్కిల్ పరిధిలో విస్తృతమైన అవగాహన కల్పిస్తామన్నారు. బాధ్యత రహితంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను సేకరిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తా

కొత్తపేట మారుతీనగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్బీనగర్ , మే 18: కొత్తపేట డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. కొత్తపేట మారుతీనగర్‌లో నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పవన్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలోపు మంజూరైన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు ఆరిఫ్‌తో పాటుగా దయాకర్, నాయకులు కొత్త తిరుమల్, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

తోపుడు బండ్లు అందజేసిన జీఎంఆర్ సంస్థ, కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్

బడంగ్‌పేట, మే18: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన చిరు వ్యాపారులు తట్ట నెత్తిన పెట్టుకొని కూరగాయలు, పండ్లు అమ్ముతున్న వారిని గమనించి జీఎంఆర్ సంస్థ ద్వారా వారికి తోపుడు బండ్లు అందించే విధంగా కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ చొరవ తీసుకున్నారు. జీఎంఆర్ సంస్థ వారు ఆరుగురిని గుర్తించి ఆరు తోపుడు బండ్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేటర్ యాతం వపన్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సేవా ధృక్పథం ఉంటే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఎదుటి మనిషి కష్టాలను అర్థం చేసుకొని సహాయం చేసే గుణం ఉండాలన్నారు. జీఎంఆర్ సంస్థ వారిని ఆయన అభినందించారు. పేద ప్రజలకు సహాయం చేయడానికి మరి కొంత మంది ముందుకు రావాలన్నారు.

లాభసాటి పంటలపై దృష్టి సారించాలి

ప్రోచర్‌ను విడుదల చేస్తున్న జడ్పీటీసీ జంగారెడ్డి, ఎంపీపీ జ్యోతి పాండు, అధికారులు

కందుకూరు, మే 18 : రైతులు లాభసాటి పంటలపై దృష్టి పెట్టాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు మంద జ్యోతి పాండు సూచించారు. శనివారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫాం పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రైతులు లాభసాటి పంటలను సాగు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఆయిల్ ఫాం పంటలను సాగు చేసుకున్నట్లయితే అధికంగా లాభాలు ఉంటాయని వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాత, హార్టికల్చర్ ఏడీఏ సంజయ్ కుమార్ తెలిపారు. ఎకరానికి 8నుంచి 12టన్నుల దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ ఫాం ఏర్పాటు చేసుకున్నట్లయితే ప్రభుత్వం 90 శాతం రాయితీ, డ్రిప్ వసతి కల్పిస్తుందన్నారు. మొక్కలు నాటిన 4 సంవత్సరాల వరకు ఎకరానికి రూ. 4వేల 200 వందల సబ్సిడీని ఇస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30 సంవత్సరాల వరకు పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ పంటలకు నీటి వసతి ఉండాలని, అదే విధంగా చీడపురుగుల బెడద ఉండదని వివరించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి లావణ్య, హార్టికల్చర్ అధికారి సౌమ్య, వాల్యు ఆయిల్ వైఎస్ ప్రెసిడెంట్ రాంమోహన్, ఏఈఓ రాజు, ఎఫ్ఓ మల్లేశ్, డైరెక్టరు పొట్టి ఆనంద్,రైతులు దామోదర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మల్లేశ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన పెంచుకోవాలి

కాచిగూడ,మే 18: మధుమేహంపై అవగాహన లేక ప్రజలు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు తెలిపారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. 80శాతం మందికి ఎఫ్‌బీఎస్ 120 నుంచి 170వరకు, పీఎల్‌బీఎస్ 190 నుంచి 280 వర కు నార్మల్ కంటే ఎక్కువగా ఉంటుంది. ప్రధాన కారణం మధుమేహంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం, ఆహార నియమాలు పాటించకపోవడం, ప్రతి రోజూ వ్యాయామం చేయకపోవడమేనని పేర్కొన్నారు. వివరాలకు 9949238492లో సంప్రదించాలని కోరారు.

గుంతలు పూడ్చివేత

చర్లపల్లి, మే 18 : చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివసాయినగర్ డీమార్ట్ వద్ద ఏర్పడిన గుంతలను సిబ్బంది పూడ్చివేశారు. వర్షంతో మ్యాన్‌హోల్ పొంగి పెద్ద గుంతగా ఏర్పడటంతో కాలనీ అధ్యక్షుడు పద్మారెడ్డి సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం మ్యాన్ హోల్ గుంతను పూడ్చి వేత పనులు చేపట్టడంతో పాటు డ్రైనేజీలో చెత్తను తొలగించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

ఉప్పల్, మే 18: క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారికి తగిన సహకారం అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్ డివిజన్‌కు చెందిన సాయితేజ కరాటే పోటీల్లో పాల్గొని, బంగారు పతకం సాధించి, జాతీయ కరాటే పోటీలకు ఎంపికైనారు. ఈ మేరకు చిలుకానగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేను సాయి తేజ కలిశారు. ఈ సందర్భంగా సాయితేజను సత్కరించి, అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి, దేశం గర్వించే స్థాయికి చేరుకోవాలని సూచించారు.

సాయితేజను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మలక్‌పేట, మే 18: ప్రపంచ హైపర్ టెన్షన్ డేను పురస్కరించుకొని శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రేష్ట శ్రీ కమలా దవాఖానలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వేల రూపాయల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేయటంతో దిల్‌సుఖ్‌నగర్‌తోపాటు ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఫైబ్రో స్కాన్(ఫ్యాటీ లివర్ స్కాన్), బీఎండీ పరీక్ష(50 ఏండ్లు పైబడిన వారికి ఎముకల్లో క్యాల్షియం శాతాన్ని నిర్ధారించే పరీక్ష), ఈసీజీ, జీఆర్‌బీఎస్, సీబీపీ తదితర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆర్థోపెడిక్ వైద్యులు సునీల్, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ బాలాజీ ప్రసాద్, దంత వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ రాకేశ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం పది గంటలనుంచి సాయంత్రం నాలుగు వరకు కొనసాగిన ఈ వైద్య శిబిరంలో సుమారు మూడు వందల మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు ఆనంద్‌బాబు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలి

కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీకృప అపార్ట్‌మెంట్ ప్రతినిధులు

ఎల్బీనగర్ , మే 18: కొత్తపేట మోహన్ నగర్ శృంగేరీ కాలనీ సర్వేనంబర్ 135లోని ప్రభుత్వ భూమిలో శ్రీకృప అపార్ట్‌మెంట్ పక్కన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, దీనిని అడ్డుకుని ప్రజోపయోగార్థం కేటాయించాలని అపార్ట్‌మెంటు ప్రతినిధులు కోరుతున్నారు. కొందరు వ్యక్తులు అక్రమంగా ఈ స్థలంలోకి ప్రవేశించి భూమిని కాజేసేందుకు యత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ మేరకు కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల పాలు కాకుండా పార్కును ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ తహసీల్దార్‌తో పాటుగా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్తానని తెలిపారు. అపార్ట్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన వేరియంట్ పాలను ఆదరించండి

హయత్‌నగర్, మే 18 : నార్ముల్ మదర్ డెయిరీ నుంచి ప్రవేశపెడుతున్న నూతన వేరియంట్ పాలను వినియోగదారులు ఆదరించాలని ఆ సంస్థ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి కోరారు. 'మదర్ విజయ' పేరుతో మార్కెట్‌లో ప్రవేశపెడుతున్న నూతన వేరియంట్ పాల ప్యాకెట్‌ను డైరెక్టర్లు జలంధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయశ్రీ ఉప్పల వెంకట్ రెడ్డి, సంస్థ ఎండీ కృష్ణతో కలిసి చైర్మన్ శ్రీకర్‌రెడ్డి హయత్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం, వినియోగదారుల నమ్మకం రెండు కళ్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. మార్కెట్‌లో పోటీ నేపథ్యంలో వేర్వేరు వేరియంట్‌ల పాలను ప్యాకింగ్ చేస్తున్నామన్నారు. రైతుల నుంచి సేకరించిన నాణ్యమైన పాలను తక్కువ సమయంలో వినియోగదారులకు అందిస్తున్నామని వివరించారు. వినియోగదారులు మదర్ విజయ పాలు కొనుగోలు చేసి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు దివాకర్, శివకుమార్, ఏజీఎం జీవీఎన్ రెడ్డి, ఏఓ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తొలగింపు

అంబర్‌పేట, మే 18 : భారీ వర్షానికి బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బుర్జుగల్లీ, ప్రభుత్వ దవాఖాన ప్రాంతాలలో బురద, మట్టి విపరీతంగా చేరింది. స్థానికులు నడవడానికి వీలు లేకుండా రోడ్డును బురద కప్పేసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ పద్మ, సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి శనివారం ఆ బస్తీలకు వెళ్లారు. రోడ్లపై చేరిన బురద, మట్టి, చెత్తను తొలగింపజేశారు.

పడకేసిన పారిశుధ్యం

మీర్‌పేట పెద్ద చెరువు కట్టపై పేరుకు పోయిన చెత్త

బడంగ్‌పేట, మే18: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్యం పడకేసింది. మీర్‌పేట కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడం ఇందుకు కారణమని స్థానికులు అంటున్నారు. కమిషనర్ ఎప్పుడు కార్యాలయంలో ఉండరని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ కారు మాత్రం కార్యాలయంలో ఉంటుంది. అధికారి ఎక్కడ ఉంటారో తెలియదని వివిధ కాలనీ వాసులు పేర్కొంటున్నారు. రోడ్లపై ఎక్కడ చూసిన చెత్త గుట్టలుగా పేరుకు పోయింది. చెత్త పేరుక పోవడంతో పందులకు, దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ముందని స్థానికులు వాపోతున్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, కలరా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

ఉప్పల్, మే 18 : ఉప్పల్‌లోని శిల్పారామంలో వారంతపు సంస్కాతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పేరిణి, ఆంధ్ర నాట్యం ప్రదర్శనలు అలరించాయి. పుష్పాంజలి, బ్రహ్మగద్యం, జుగల్బంది, సంధ్యతాండవం, దేవి కైవారం, సరస్వతి గీతం, మేళప్రాప్తి, అదిగో అల్లదిగో, శబ్ధ పల్లవి, తదితర అంశాలలో ప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో శివాని, కృతి, శ్రద్ధ, రమ్య, ప్రగ్య, నిత్యశ్రీ, సహస్ర, హరిణి, శ్రీవల్లి, ఝాన్సి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల నృత్యప్రదర్శన

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రిన్సిపాల్ ఉమాదేవి

కందుకూరు, మే 18 : 2024-2025 విద్యా సంవత్సరానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, గ్రూపులు, తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో బోధన ఉంటుందని, కళాశాలలో చేరే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కాలర్ షిప్, విద్యార్థుల ప్రయాణ నిమిత్తం బస్సు పాసులు, సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు కళాశాల ఫోన్ 9398966592, 9542546850 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

అలరించిన గజ పూజోత్సవం

రవీంద్రభారతి, మే18 : సాత్విక స్కూల్ ఆఫ్ భరత నాట్యం, కర్ణాటక సంగీతం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతి లోని ప్రధాన కళావేదికపై గజపూజోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించారు.

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి



మారుతీనగర్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

ఎల్బీనగర్ , మే 18: వాసవీ మాత జయంతి వేడుకలను ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎంఎల్ఆర్ గుప్త, నాయకులు పబ్బ బాలయ్య, ఎన్టీఆర్ కృష్ణ, మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్త, ప్రవీణ్, నరేశ్, ఎల్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో మోహన్‌నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వాసవీ జయంతి వేడుకలు నిర్వహించారు. 108 మంది మహిళలతో కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పవన్‌కుమార్, ధీరజ్‌రెడ్డిలతో పాటుగా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ డివిజన్‌లో...

గోపుకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లోని కమ్యూనిటీ హాల్లో శనివారం మన్సూరాబాద్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు మొరిశెట్టి సంతోష్‌కుమార్, సంఘం కోశాధికారి అంజిబాబు, కార్యదర్శి భాస్కర్, సభ్యులు లింగమయ్య, విశ్వనాథం, అరవింద్, వెంకటరమణ, నాంపల్లి రమణ, రాజీవ్‌కుమార్, అనిల్, వెంపటి గోపి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

చంపాపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి జయంతి మహోత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంపాపేట డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె రవీందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేశ్‌గుప్తా, సహాయకార్యదర్శి ఊరె మధుసూదన్ గుప్తా, అమావాస్య అన్నదాన కమిటీ అధ్యక్షుడు ఇడుకుల విజయనాథ్ గుప్తా, కోశాధికారి రమణయ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శాలివాహననగర్‌లో..

మలక్‌పేట: ఆర్యవైశ్యుల కుల దైవం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలను మూసారాంబాగ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం శాలివాహననగర్ లోని శ్రీ కాశీ విశ్వేశ్వర పంచాయతన దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మూసారాంబాగ్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిగంబర్, కార్యదర్శి పబ్బ యుగంధర్, కోశాధికారి గుండ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి కాసనగొట్టు వేణుగోపాల్, అసిస్టెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు మాంకాళి రమేశ్, తడకమళ్ల చంద్రమోహన్ తోపాటు మూసారాంబాగ్‌లోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్పఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

గంగస్నానానికి ఊరేగింపుగా తరలివెళ్తున్న భక్తులు

మన్సూరాబాద్, మే 18: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సరస్వతినగర్ కాలనీ సమీపంలోని శ్రీ బీరప్పస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రెండో రోజు కట్నం పెట్టుట, జల్దీ గంగస్నానం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ కర్రె శంకర్, ప్రధానకార్యదర్శి జమ్ము కృష్ణయ్య మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం స్వామి వారి బోనాల ఊరేగింపు, ఈనెల 20న ఉదయం బీరప్ప, కామరాతి స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో పాటు ఇతర రాజకీయ నాయకులు పాల్గొని పూజలు నిర్వహిస్తారన్నారు.

Before the Hon'ble Arbitrator / Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.70 of 2024
Between
SHRIRAM RAGHAVENDRA CHITS Br.Mahabubnagar. ...Disputant
And
A. Srikanth Goud and others ...Opponents
NOTICE
To
3. M. ramakrishna S/o M. Gandhi Raju, Aged 47 years, Occ: Pro. Sree Sadguru Sai Enterprisess, at Chinthala Kunta of L.B. Nagar, Hyderabad, R/o H.No.11-13-262/C9/204, Duncon Delight, Chitra Layout, N.T.R Nagar, Chintalakunta, L.B. Nagar of Hyderabad. ...Opponents
Claim for Recovery of Rs. 2,08,310/- (Rupees Two lakhs Eight thousand Three hundred Ten only)
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabubnagar on 25-05-2024 at 11-30A.M. for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar
S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415